

సిఎఎను ఉపసంహరించాలని ప్రచారం




కరపత్రాలు పంపిణీ చేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - పోడూరు

సిఎఎ నిబంధనలను వెంటనే ఉపసంహరించుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి పిల్లి ప్రసాద్ డిమాండ్ చేశారు. సోమవారం పోడూరు కొత్తపేటలో సిపిఎం ఆధ్వర్యంలో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ భారతదేశ లౌకిక స్వభావాన్ని నాశనం చేయాలని కేంద్ర ప్రభుత్వం చూస్తుందన్నారు. ఈ నేపథ్యంలో వచ్చే ఎన్నికల్లో బిజెపిని ఓడించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కాకర వెంకటేశ్వర్లు, బొంతు శ్రీను మాట్లాడారు.

'రెబల్స్' రచ్చ..!

- అసంతృప్తులతో వైసిపి, టిడిపిలో గందరగోళం
- ఉండి, నూజివీడు, నరసాపురంల్లో టిడిపికి తప్పని తలనొప్పి
- చింతలపూడి వైసిపి ఎంఎల్ఎ కాంగ్రెస్‌లో చేరి పోటీకి రెడీ
- ఏ పార్టీ అభ్యర్థికి నష్టమో అంటూ రకరకాల లెక్కలు
- వెనక్కి తగ్గుతారా.. పోటీకి సిద్ధమా అనేది సందిగ్ధమే



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

టిడిపి, వైసిపిలో అసంతృప్తులతో రాజకీయం మరింత వేడెక్కుతోంది. రెండు జిల్లాల్లో 14 అసెంబ్లీ స్థానాలు ఉండగా ప్రధానంగా నాలుగుచోట్ల ఆయా పార్టీల నుంచి టిక్కెట్ ఆశించి భంగపడిన నాయకులు రెబల్స్‌గా, ఇతర పార్టీల నుంచి పోటీ చేసేందుకు సిద్ధమయ్యారు. ప్రధాన పార్టీ అభ్యర్థులకు దీటుగా నియోజకవర్గంలో ముమ్మరంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. దీంతో ప్రధాన పార్టీలైన టిడిపి, వైసిపి అభ్యర్థుల్లో ఎవరికి నష్టం జరుగుతుందోననే చర్చ సర్వత్రా సాగుతోంది. ఉండి నియోజకవర్గ టిక్కెట్ ఆశించి భంగపడిన మాజీ ఎంఎల్ఎ వేటుకూరి శివరామరాజు స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగేందుకు సిద్ధమయ్యారు. నియోజవకర్గమంతా తిరుగుతూ ప్రచారం సైతం నిర్వహిస్తున్నారు. ఆయన్ని బుజ్జగించేందుకు టిడిపి ఎన్ని ప్రయత్నాలు చేసినా శివరామరాజు వెనక్కి తగ్గలేదు. దీంతో ఉండి నియోజకవర్గంలో రాజకీయం రసవత్తరంగా మారింది. శివరామరాజు బరిలో ఉండటంతో టిడిపికి నష్టమా, వైసిపికి నష్టమా అనే అంచనాలు పెద్దఎత్తున సాగుతున్నాయి. ఇండిపెండెంట్‌గా నామినేషన్ వేసినప్పటికీ విత్‌డ్రాల సమయం వచ్చేసరికి ఆయన్ని ఒప్పించి పక్కకు తప్పించే అవకాశాలు ఉన్నాయనే ప్రచారమూ సాగుతోంది. అప్పటి వరకూ టిడిపికి తలనొప్పి తప్పదని చెప్పొచ్చు. నరసాపురం నియోజకవర్గ టిక్కెట్‌కు సంబంధించి ఆది నుంచి జనసేన అభ్యర్థి బొమ్మిడి నాయకర్ పేరు ప్రముఖంగానే వినిపించింది. టిడిపి నుంచి మాధవనాయుడు, పొత్తూరి రామరాజు, కొవ్వలి రామ్మోహన్‌నాయుడు టిక్కెట్ ఆశించారు. వైసిపిని వదిలి జనసేనలో చేరిన కొత్తపల్లి సుబ్బారాయుడు నరసాపురం టిక్కెట్ తనదే అంటూ చెబుతూ వచ్చారు. చివరికి జనసేన అభ్యర్థిగా నాయకర్ పేరు ఖరారైంది. దీంతో టిడిపి అధిష్టానం రామరాజు, రామ్మోహననాయుడుతో మాట్లాడి ఇరువురి నుంచి సమస్య లేకుండా సద్దుమణిగేలా చేసింది. అయితే మాజీ ఎంఎల్ఎ బండారు మాధవనాయుడుని మాత్రం పిలిచి మాట్లాడలేదని తెలిసింది. దీంతో ఎన్నికల బరిలో ఉండేందుకు మాధవనాయుడు సిద్ధమైనట్లు తెలుస్తోంది. తన రాజకీయ భవిష్యత్తు ప్రకటిస్తానంటూ ఇటీవల మీడియా సమావేశంలో మాధవనాయుడు ప్రకటించిన సంగతి తెలిసిందే. మాధవనాయుడు ఇండిపెండెంట్‌గా బరిలోకి దిగితే ఏ పార్టీకి నష్టం వాటిల్లుతుందోననే చర్చతోపాటు టిక్కెట్ రాకపోవడంతో అలకబూనిన కొత్తపల్లి సుబ్బారాయుడు జనసేనకు మద్దతుగా నిలుస్తారా, రెబల్‌గా మారి వ్యతిరేకంగా పని చేస్తారా అనేది తేలాల్సి ఉంది. 2019 ఎన్నికల్లో చివరి నిముషంలో వైసిపిలో చేరిన కొత్తపల్లి అప్పటి జనసేన అభ్యర్థి నాయకర్‌కు నష్టం చేకూర్చారనే చర్చ అప్పట్లో సాగింది. ఈసారి ఏం జరుగుతుందో వేచిచూడాలి.

'ముద్దరబోయిన' తిరుగుబాటు జెండా

టిడిపి నుంచి నూజివీడు టిక్కెట్ ఆశించిన ముద్దరబోయిన వెంకటేశ్వరరావుకు టిడిపి అధిష్టానం ఝలక్ ఇచ్చింది. స్థానికేతరుడు, వైసిపి నుంచి వచ్చిన కొలుసు పార్థసారధికి టిక్కెట్ ఇచ్చింది. దీంతో ముద్దరబోయిన తిరుగుబాటు జెండా ఎగురవేశారు. ఇండిపెండెంట్‌గా పోటీ చేసేందుకు ఆయన సిద్ధమయ్యారు. ప్రధాన పార్టీల అభ్యర్థులకు ధీటుగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. ఆర్థికంగా భారీగా ఖర్చు పెట్టేందుకు సైతం ముద్దరబోయిన సిద్ధమైనట్లు తెలుస్తోంది. అంతేకాకుండా గతంలో పోటీ చేసి ఓటమి పాలయ్యారనే సానుభూతి ముద్దరబోయినకు ఉంది. నూజివీడు బరిలో ఈయన తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. టిడిపికి నష్టం అత్యధికంగా ఉంటుందని అంచనా వేస్తున్నప్పటికీ వైసిపి ఓట్లను చీల్చే అవకాశం ఉందని లెక్క కడుతున్నారు. ఈయన ఎన్నికల బరిలో కడవరకూ నిలబడతారో, లేదో వేచి చూడాల్సి ఉంది.

వైసిపి సిట్టింగ్ ఎంఎల్ఎ కాంగ్రెస్ నుంచి పోటీ

వైసిపి చింతలపూడి సిట్టింగ్ ఎంఎల్ఎ ఉన్నమట్ల ఎలిజా మరోసారి టిక్కెట్ ఆశించినా దక్కలేదు. దీంతో ఆయన వైసిపిని వీడి కాంగ్రెస్‌లో చేరారు. చింతలపూడి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేయనున్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. ఎంఎల్ఎగా ఉన్న ఆయన తనకంటూ సొంత బలగాన్ని తయారు చేసుకున్నారు. దీంతో వైసిపికి ఇబ్బందికరమేననే ప్రచారం సాగుతోంది. ఆయా స్థానాల్లో ఏం జరుగుతుందో ఎన్నికల బరిలో చూడాల్సి ఉంది.

రాజుల పోరు.. రసవత్తరం..!



- 'ఉండి'లో మారుతున్న రాజకీయ సమీకరణలు
- టిడిపి, వైసిపి అభ్యర్థులుగా మంతెన రామరాజు, పివిఎల్
- స్వతంత్ర అభ్యర్థిగా మాజీ ఎంఎల్ఎ శివరామరాజు సై
- 'ఉండి'పై కన్నేసిన నరసాపురం ఎంపీ రఘురామకృష్ణంరాజు
- టిడిపి నుంచి పోటీలో ఉంటారని ప్రచారం
- ఆసక్తికరంగా 'ఉండి' రాజకీయం

ప్రజాశక్తి - భీమవరం

ఉద్దండుల 'ఉండి'లో రాజుల పోరు రసవత్తరంగా మారింది. మారుతున్న రాజకీయ సమీకరణలతో టిడిపికి బలమైన కోటలో రాజకీయం వేడెక్కింది. టిడిపి, వైసిపి అభ్యర్థులతోపాటు టిడిపి రెబల్ అభ్యర్థి ఇప్పటికే బరిలో ఉండనున్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే మరో నేత టిడిపి టిక్కెట్ కోసం యత్నిస్తుండటం సర్వత్రా చర్చనీయాంశమైంది. ఈ నేపథ్యంలో అందరి చూపు ఉండి నియోజకవర్గంపై పడింది. అయితే ఈ రసవత్తర పోరులో నిలిచేది ఎవరనే దానిపై సర్వత్రా చర్చ సాగుతోంది.


ఉండి నియోజకవర్గం అంటే తెలియని వారు ఎవరూ ఉండరు. రాష్ట్ర రాజకీయాల్లో సైతం ఉండి నియోజకవర్గానికి ప్రత్యేక స్థానం ఉంటుంది. ఇది ఆది నుంచి టిడిపికి బలమైన కోటగా ఉండటంతోపాటు క్షత్రియులకు పట్టున్న నియోజకవర్గంగా పేరొందింది. 1952లో ఈ నియోజకవర్గం ఏర్పడింది. ఇప్పటి వరకూ 16 సార్లు ఇక్కడ ఎన్నికలు జరిగాయి. 1983లో టిడిపి ఆవిర్భావం నుంచి 1999 వరకు కలిదిండి రామచంద్రరాజు (అబ్బాయి రాజు) ఐదుసార్లు ఎంఎల్ఎగా గెలుపొందారు. ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో మూడుసార్లు టిడిపి గెలుపొందింది. ఇక్కడ గెలిచిన ఎంఎల్ఎల్లో ఎనిమిది మంది క్షత్రియులే కావడం విశేషం. అటు టిడిపికి.. ఇటు క్షత్రియులకు అడ్డాగా ఉన్న ఈ నియోజకవర్గంపై ప్రస్తుతం అందరి దృష్టి పడింది. టిడిపి నుంచి కూటమి అభ్యర్థిగా సిట్టింగ్ ఎంఎల్ఎ మంతెన రామరాజు, వైసిపి నుంచి నియోజకవర్గ ఇన్‌ఛార్జి, డిసిసిబి ఛైర్మన్ పివిఎల్.నరసింహరాజు, (పివిఎల్), టిడిపి రెబల్ అభ్యర్థిగా వేటుకూరి వెంకట శివరామరాజు (కలవపూడి శివ) ఎన్నికల బరిలో తలపడుతున్నారు. 2009, 2014లో జరిగిన ఎన్నికల్లో టిడిపి నుంచి శివరామరాజు రెండుసార్లు ఎంఎల్ఎగా గెలుపొందారు. 2019 ఎన్నికల్లో శివరామరాజు టిడిపి అధిష్టానం నిర్ణయం ప్రకారం నర్సాపురం ఎంపీ అభ్యర్థిగా బరిలోకి దిగారు. శివరామరాజుకు సమీప బంధువైన మంతెన రామరాజుకు ఉండి టిక్కెట్ ఇచ్చారు. ఆ ఎన్నికల్లో శివరామరాజు ఓటమి పాలవగా, రామరాజు గెలుపొందారు. ప్రస్తుత ఎన్నికల్లో టిడిపి అభ్యర్థిగా సిట్టింగ్ ఎంఎల్ఎ మంతెన రామరాజుకు మరో అవకాశం కల్పించింది. ఈ టిక్కెట్‌ను ఆశించిన మాజీ ఎంఎల్ఎ శివరామరాజు భంగపాటుకు గురయ్యారు. టిడిపి అధిష్టానం ఘోరంగా అవమానించిందని భావించిన శివరామరాజు స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగుతున్నట్లు ప్రకటించారు. 2014లో జరిగిన ఎన్నికల్లో వైసిపి తొలిసారి పోటీ చేసి 20 శాతం ఓట్ల వ్యత్యాసంతో ఓటమి చవిచూసింది. టిడిపి, బిజెపి, జనసేన పొత్తులో భాగంగా ఇక్కడ టిడిపి గెలిచింది. అయితే ఈ క్రమంలో వైసిపి నియోజకవర్గ బాధ్యతలు పివిఎల్ చేపట్టి పార్టీని నిలబెట్టారనడంలో ఎటువంటి సందేహమూ లేదు. 2019లో జరిగిన ఎన్నికల్లో వైసిపి నుంచి పివిఎల్ నరసింహారాజు పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఈ క్రమంలో ఉండి ఎన్నికల రాజకీయం రసవత్తరంగా మారింది.

'ఉండి'పై ఎంపీ రఘురామకృష్ణంరాజు చూపు

నరసాపురం ఎంపీ కనుమూరి రఘురామకృష్ణంరాజు ఉండి నుంచి ఎంఎల్ఎ అభ్యర్థిగా బరిలోకి దిగనున్నట్లు సర్వత్రా చర్చ సాగుతోంది. అయితే ఆయన టిడిపి తరఫున బరిలోకి దిగుతారని ఒక ప్రచారం, స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగుతారనే ప్రచారం మరోవైపు సాగుతోంది. వైసిపి నుంచి 2019లో ఎంపీగా గెలిచిన కొద్దిరోజులకే రఘురామకృష్ణంరాజు ఆ పార్టీపై తిరుగుబాటు జెండా ఎగరేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఆయన బిజెపితో సన్నిహితంగా ఉంటూ టిడిపి, జనసేనకు అనుకూలంగా మాట్లాడుతూ వైసిపిపైనా, ప్రధానంగా సిఎం జగన్‌పైనే విమర్శలు ఎక్కుపెట్టేవారు. ఇటీవల తాడేపల్లిగూడెంలో జరిగిన 'జెండా' సభలోనూ తాను కూటమిని నుంచి ఎంపీ అభ్యర్థిగా బరిలోకి దిగుతానని స్వయంగా ప్రకటించేశారు. అయితే రఘురామకృష్ణంరాజుకు ఝలక్ ఇస్తూ బిజెపి తన అభ్యర్థిగా ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భూపతిరాజు శ్రీనివాస వర్మను ఎంపిక చేసింది. దీంతో రఘురామకృష్ణంరాజు తాను వచ్చే ఎన్నికల్లో కచ్చితంగా పోటీలో ఉంటానని తాజాగా ప్రకటించడంతో ఉండి అభ్యర్థిగా బరిలోకి దిగుతారనే ప్రచారం ఊపందుకుంది. ఈ క్రమంలో ఉండి రాజకీయం రోజుకో రీతిన మలుపులు తిరుగుతోంది.

బాపనయ్య జీవితం స్ఫూర్తిదాయకం

వర్ధంతి సభలో వ్యకాస జిల్లా సహాయ కార్యదర్శి వీరభద్రరావు



బాపనయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - తణుకు రూరల్

ఉద్యమాల ముద్దుబిడ్డ గుంటూరు బాపనయ్య జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బళ్ల చినవీరభద్రరావు అన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం వ్యవస్థాపక నిర్మాతల్లో ఒకరైన బాపనయ్య 46వ వర్ధంతి కార్యక్రమాన్ని వేల్పూరు స్థానిక సాలిపేటలో సోమవారం నిర్వహించారు. బాపనయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఈ సందర్భంగా చినవీరభద్రరావు మాట్లాడుతూ పేద దళిత కుటుంబంలో జన్మించిన బాపనయ్య అంటరానితనం, పేదరికం కారణంగా అనేక అవమానాలు భరించారన్నారు. ఈ సమాజంలో పేదరికం, అంటరానితనం పోవాలంటే కమ్యూనిజంతో తప్ప మరో మార్గం లేదని భావించిన బాపనయ్య చదువు పూర్తి చేసుకుని స్వగ్రామం వచ్చిన అనంతరం 1942లో కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వం స్వీకరించి పార్టీ అభివృద్ధి కోసం పని చేసిన నాయకుడని వీరభద్రరావు తెలిపారు. 1947లో రాష్ట్రవ్యాప్తంగా పాలేర్ల జీతాల పెంపుదల, పని గంటలు తగ్గింపు కోసం జరిగిన పోరాటానికి ఆయన నాయకత్వం వహించిన విషయాన్ని గుర్తు చేశారు. 1948లో జమిందారీ విధానం రద్దు చేసి దున్నేవాడికి భూమి అనే నినాదంతో సాగిన పోరాటాలు, భూ సంస్కరణలు అమలు చేసి బంజర భూములను పేదలకు పంచాలాని జరిగిన పోరాటాల కారణంగా ప్రభుత్వం బాపనయ్యను అక్రమంగా అరెస్టు చేసి రాజమండ్రి, కడలూరు జైళ్లలో పెట్టి 1951 వరకు నిర్బంధించిందన్నారు. మూడుసార్లు శాసనసభ్యునిగా, ఎంఎల్‌సిగా ఎన్నికైన ఆయన తుది శ్వాస విడిచే వరకూ ప్రజల కోసం పని చేసి ప్రజల మన్ననలను పొందిన గొప్ప పోరాట యోధుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ సభ్యులు విశ్వనాథం సుబ్బారావు, వాటాల నాగేశ్వరరావు, బళ్ల నాగలక్ష్మి, వాసా వెంకటేశ్వరరావు, సోరపల్లి రామకృష్ణ, కురేళ్ల రాంబాబు పాల్గొన్నారు.

తనిఖీల్లో రూ.82 వేల నగదు స్వాధీనం

ఉంగుటూరు రిటర్నింగ్ అధికారి ఎన్ఎస్‌కె.ఖాజావలీ

ప్రజాశక్తి - గణపవరం

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమలులో భాగంగా ఉంగుటూరు నియోజకవర్గంలో అధికారులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఉంగుటూరు నియోజకవర్గ ఎన్నికల అధికారి, ఏలూరు ఆర్‌డిఒ ఎన్ఎస్‌కె.ఖాజావలీ వెల్లడించారు. సోమవారం నిర్వహించిన తనిఖీల్లో భాగంగా గణపవరం మండలం సరిపల్లి గ్రామం వద్ద రూ.82 వేల నగదు సీజ్ చేసినట్లు తెలిపారు. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం నిర్వహించిన తనిఖీల్లో రూ.82 వేల నగదు గుర్తించి స్వాధీనపర్చుకున్నారన్నారు. నగదు తీసుకెళ్లే సమయంలో సంబంధిత పత్రాలు తమతో ఉంచుకోవాలని సూచించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి మేరకు రూ.50 వేల కంటే ఎక్కువ తరలిస్తే స్వాధీనం చేసుకుంటామని హెచ్చరించారు.

'ఇండియా' వేదికను బలపరచాలి

సిఐటియు జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు



మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

బిజెపి ప్రభుత్వాన్ని, ఆ ప్రభుత్వానికి సహకరించే అన్ని పార్టీలను ఓడించాలని, ఇండియా కూటమిని బలపరచాలని సిఐటియు జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు అన్నారు. తాడేపల్లిగూడెం అపరాలు మార్కెట్ జట్టు వర్కర్స్ యూనియన్ సర్వసభ్య సమావేశం స్థానిక చుక్కా అప్పలస్వామి భవనంలో గొన్నాబత్తుల నాగేశ్వరరావు అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు, సిఐటియు పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ మాట్లాడుతూ సంపదకు మూలమైన కార్మిక రాజ్యం కోసం సిఐటియు సమరశీల పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. కార్మికులను నేడు బానిసలుగా మార్చేందుకే నాలుగు లేబర్ కోడ్లు మోడీ తీసుకొచ్చారన్నారు. కార్మికులు, ఉద్యోగుల శ్రమ ద్వారా సంపద పెరుగుతున్నప్పటికీ వారి పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చిన్న చూపు ఉందన్నారు. బిజెపి ప్రభుత్వం కార్పొరేట్లు ఇచ్చే ఎలక్ట్రోరల్ బాండ్స్ కోసం ప్రభుత్వ సంస్థలు కారుచౌకగా అమ్మేయడం లేదా మూసివేయడం చేస్తుందన్నారు. దేశ ప్రజల ఐక్యతను దెబ్బ తీయడం కోసం మతం పేరుతో విభజన రాజకీయాలు చేపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మోడీ బారి నుంచి లౌకిక రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో బిజెపిని, ఆ పార్టీకి సహకరించే అన్ని పార్టీలను చిత్తుచిత్తుగా ఓడించాలని, ఇండియా కూటమిని బలపరచాలని పిలుపునిచ్చారు. బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక, రైతాంగ వ్యతిరేక విధానాలను వెనక్కి తీసుకోకపోతే రానున్న ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అయినాల సత్యనారాయణ, నర్మాల నారాయణరావు, దాసరి రాజు, నీరుకొండ రమణ, రావి శ్రీను, ఎస్.అప్పలనాయుడు, ఇల్ల గోవిందరావు, పెంటకోట గోవిందు, బద్ది నాగేశ్వరరావు, చిట్టేటి సత్యనారాయణ, బుద్దాల తాతారావు పాల్గొన్నారు.

విద్వేషపూరిత కార్యక్రమాలు వద్దు

కలెక్టర్ సుమిత్‌కుమార్



ప్రజాశక్తి - భీమవరం

విభేదాలను పెంచేలా, పరస్పర ద్వేషాలను కల్గించేలా, విభిన్న కులాలు, మతాలు, భాషల మధ్య ఉద్రిక్తతకు దారి తీసే కార్యక్రమాలను రాజకీయ పార్టీలుగాని, అభ్యర్థులుగాని నిర్వహించకూడదని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. సాధారణ ప్రవర్తనపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆలయాలు, మసీదులు, చర్చి తదితర ప్రదేశాలను ఎన్నికల ప్రచారానికి వేదికగా ఉపయోగించకూడదని తెలిపారు. మతం, కులం, ప్రాతిపదికన ఓట్లు వేయమని, లేదా వేయవద్దని అభ్యర్థించడం, ఓట్లను అభ్యర్థించడానికి ఏదేని మతపరమైన గుర్తును ఉపయోగించడం చేయకూడదని పేర్కొన్నారు. ఓటర్లకు ఏ రూపంలోనైనా లంచం, రివార్డును ఇవ్వకూడదని తెలిపారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న జెసి

ప్రజాశక్తి - కాళ్ల

మండలంలోని పెదఅమిరం, కోపల్లె, వేంపాడు గ్రామాల్లోని 11 పోలింగ్ స్టేషన్లను జాయింట్ కలెక్టర్ ప్రవీణ్‌ఆదిత్య సోమవారం సందర్శించారు. పోలింగ్ కేంద్రంలో ప్రాథమిక సౌకర్యాలను ఆయన పరిశీలించారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఓటు వేసేందుకు వచ్చిన ప్రజలకు ఎటువంటి అసౌకర్యమూ కలగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ఆయన వెంట ఆర్ఐ సురేష్, గ్రామ కార్యదర్శి సునీల్‌రాజు, విఆర్ఒ సాయిసోమనాథ్ తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఉపాధి హామీ కూలీ మృతి



సలోమాన్ (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

మండలంలోని మెట్టఉప్పరగూడెం గ్రామానికి చెందిన ఉపాధి హామీ కూలి మర్లపూడి సులోమాన్(60) గుండెపోటుతో మృతి చెందిన ఘటన సోమవారం ఉదయం చోటుచేసుకుంది. మెట్టఉప్పరగూడెంలో ఉపాధి పనులకు సులోమాన్ ఉదయమే వెళ్లాడు. ఉదయం 10.30 గంటల సమయంలో సులోమాన్ తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. దీంతో సహచర కూలీలు చికిత్స కోసం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందాడు. మృతుని భార్య రోడ్డు ప్రమాదంలో గతంలో మృతి చెందింది. కరోనా సమయంలో కుమారుడు కూడా మృతి చెందడంతో కోడలు, మనవళ్లకు సులోమాన్ పెద్దదిక్కయ్యాడు.

వ్యకాస సంతాపం

సలోమాన్ మృతి పట్ల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కండెల్లి సోమరాజు సంతాపం తెలిపారు. మృతుని కుటుంబాన్ని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సులోమాన్ కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు.

నిట్ విద్యార్థులకు బహుమతులు




బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆంధ్రప్రదేశ్ (ఏపి నిట్)కి చెందిన నలుగురు విద్యార్థులు వేర్వేరు కేటగిరి విభాగాల్లో రెండు బహుమతులను అందుకున్నారు. సంస్థలోని మెటలర్జికల్ మెటీరియల్స్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన పరిశోధక విద్యార్థి రాఘవరపు పార్థసారధికి జాతీయస్థాయిలో ఉత్తమ పేపర్ అవార్డు దక్కింది. పౌడర్ మెటలర్జికల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (పిఎంఎఐ) ప్రతి ఏడాది జాతీయస్థాయిలో కాన్ఫరెన్స్ నిర్వహిస్తుంది. దీనిలో భాగంగా ఈ ఏడాది పూణేలో నిర్వహించిన 50వ జాతీయ స్థాయి కాన్ఫరెన్స్‌కి పార్థసారధి హాజరై మెకానికల్ ఎల్లోయింగ్ ఆఫ్ హై ఎంట్రోపీఎల్లాయిస్‌పై పేపర్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ప్రజెంటేషన్‌ను మెచ్చుకున్న నిర్వాహకులు ఉత్తమ పేపర్ అవార్డుతో పాటు రూ.ఐదు వేల నగదు అందించారు. ఇఇఇ నాలుగో సంవత్సరం చదువుతున్న వి.జయంత్, పి.భాను, కె.దీక్షిత ఇటీవల శశి ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన ప్రాజెక్ట్ ఎక్స్ పో కార్యక్రమంలో మైక్రో కంట్రోలర్‌ను ఉపయోగించి ఎలక్ట్రికల్ వాహనాల్లో తక్కువ ధర బ్యాటరీ, నిర్వహణ వ్యవస్థ, ఆరోగ్య స్థితిని అంచనా వేయడం అనే ప్రాజెక్టును ప్రదర్శించారు. ఎలక్ట్రికల్ వాహనంలో ఉపయోగించే బ్యాటరీలను మైక్రో కంట్రోలర్ సాయంతో ఓల్టేజీ, టెంపరేచర్‌ను గుర్తించి సులువుగా తెలుసుకోవచ్చు. ఈ ప్రాజెక్టు తృతీయ స్థానాన్ని, రూ.5 వేల నగదును దక్కించుకుంది. వీరిని నిట్ ఇన్‌ఛార్జి డైరెక్టర్ డాక్టర్ బిఎస్.మూర్తి, రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్‌శంకర్‌రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంఎంఇ, ఇఇఇ విభాగాధిపతులు డాక్టర్ రఫి మహ్మద్, డాక్టర్ టి.రమేష్, ఆచార్యులు డాక్టర్ వి.సందీప్, డాక్టర్ సునీల్ పాల్గొన్నారు.

శివారు పొలాలకూ సాగునీరందించాలి

రైతు కార్యాచరణ సమితి రాష్ట్ర కార్యదర్శి కృష్ణమూర్తి



మాట్లాడుతున్న రైతు కార్యచరణ సమితి రాష్ట్ర కార్యదర్శి కృష్ణమూర్తి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో శివారు పొలాలకూ సాగునీరందించాలని రైతు కార్యచరణ సమితి కార్యదర్శి రాష్ట్ర కార్యదర్శి లంక కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. రైతు సంఘం కార్యాలయంలో రాష్ట్ర రైతు కార్యాచరణ సమితి, అత్యవసర సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సమావేశానికి నాయకులు దండు శ్రీనివాసరాజు అధ్యక్షత వహించగా కృష్ణమూర్తి మాట్లాడారు. వరి చేలు పొట్ట దశ నుంచి వెన్ను వేసుకునే దశలో ఉన్నాయని, ఈ నేపథ్యంలో సాగునీరు ఎంతో అవసరమని చెప్పారు. సాగునీటిని తోడుకునేందుకు ప్రత్యామ్నాయం ఏర్పాటు చేసుకోవడంతో ఎకరానికి రూ.5 వేల వరకు అదనపు పెట్టుబడి అవుతున్న పరిస్థితి ఉందన్నారు. ఉండి మెయిన్ కాలువ, వెంకయ్య వయ్యేరు కాలువలో తూడు, గుర్రపుడెక్క పెరిగిపోయాయన్నారు. అలాగే మైనర్ డ్రెయిన్లలో, కాలవల్లో పెరిగిన తూడును వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. గత సార్వా పంటకు సంబంధించిన రూ.16 కోట్ల బకాయిలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో దుగ్గిరాల శ్రీనివాస్, కనుమూరి వెంకటపతిరాజు, తిరుమాని వనమారాజు, కొతపల్లి సుబ్బరాజు, రైతు నాయకులు పాల్గొన్నారు.



పంట బోదె తవ్వుతున్న ఉపాధి కూలీలు

ముమ్మరంగా ఉపాధి హామీ పనులు

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని శేరేపాలెం, పాలకమ్మచెరువు, కెపిపాలెం నార్త్, సౌత్, పేరుపాలెం నార్త్, సౌత్, మొగల్తూరు పంచాయతీల్లోని కొత్తకాయలతిప్ప, నక్కావారిపాలెం, ఇంజేటివారిపాలెం వలు ప్రాంతాల్లో ఉపాధి హామీ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఆయా ప్రాంతాల్లో పంట బోదెలు తవ్వుతున్నారు. సోమవారం కెపి పాలెం నార్త్‌లో రాజుగారి ఒడ్డు ప్రాంతం నుంచి బ్యాంక్ రోడ్డు వరకు శివారు ప్రాంతంలోని ప్రతి ఎకరాకు నీరందేలా పంటబోదెలో పూడికతీత పనులు చేపట్టారు.

నీమాస్త్రంపై రైతులకు అవగాహన

ప్రజాశక్తి - వీరవాసరం


ప్రకృతి వ్యవసాయంలో చీడను అరికట్టడంలో నీమాస్త్రం కీలకంగా పని చేస్తుందని పకృతి వ్యవసాయ జిల్లా కో-ఆర్డినేటర్ అరుణకుమారి అన్నారు. మండలంలోని నందమూరిగరువు ప్రాంతంలో రైతు భరోసా కేంద్రం వద్ద ప్రకృతి వ్యవసాయానికి సంబంధించి డివిజన్ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నీమాస్త్రం ఉపయోగాలు దాని తయారీ విధానంపై అవగాహన కల్పించారు. నీమాస్త్రం తయారు చేయడానికి పది లీటర్ల ఆవు మూత్రం, రెండు కేజీల ఆవు పేడ, వేపాకులు పది కేజీలు తీసుకుని ముద్ద చేయాలన్నారు. వంద లీటర్ల డ్రమ్ము తీసుకోవాలన్నారు. ముందుగా వంద లీటర్ల నీరు డ్రమ్ములోకి తీసుకుని వేపాకుల ముద్ద, ఆవు మూత్రం, ఆవు పేడ డ్రమ్ములో వేసి బాగా కలపాలన్నారు. 48 గంటలు ఉంచిన తర్వాత పల్చటి గుడ్డతో వడగట్టిన తర్వాత నీమాస్త్రం తయారవుతుందన్నారు. వరి చేనుకు ఒక ఎకరానికి వంద లీటర్ల నీమాస్త్రం, వంద లీటర్ల నీరు కలిపి పిచికారీ చేస్తే రసం పీల్చే పురుగులను, గొంగళి పురుగులు, అన్ని రకాల పురుగుల గుడ్లను చంపుతుందన్నారు. తెగుళ్లను కూడా నివారిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ఇన్‌ఛార్జి స్వామి, ఎంటి.రమేష్, మండల ఇన్‌ఛార్జులు శివకృష్ణ, రవికుమార్, నాగరాజు, దుర్గారావు, వీరేంద్ర, ఐసిఆర్‌పిలు, రైతులు పాల్గొన్నారు.

నరసింహరాజు గెలుపునకు కృషి చేస్తా

దాట్ల శ్రీదేవి ట్రస్ట్ అధినేత వెంకటరామరాజు

ప్రజాశక్తి - కాళ్ల

ఉండి ఎంఎల్‌ఎ అభ్యర్థి పివిఎల్.నరసింహరాజు గెలుపునకు కృషి చేస్తానని దాట్ల శ్రీదేవి ట్రస్ట్ అధినేత దాట్ల వెంకట రామరాజు అన్నారు. డిసిసిబి ఛైర్మన్ పివిఎల్.నరసింహరాజును ఆయన కార్యాలయంలో వెంకటరామరాజు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఉండి ఎంఎల్‌ఎ అభ్యర్థిగా నరసింహరాజు ఖరారైన సందర్భంగా ఆయనను కలిసి పూలదండ, శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. సిఎం జగన్ చేసిన అభివృద్ధిని, సంక్షేమ పథకాలను గడపగడపకూ వెళ్లి ప్రజలకు వివరిస్తామన్నారు. పివిఎల్ గెలుపునకు తన వంతు కృషి చేస్తానని వెంకటరామరాజు అన్నారు.



పివిఎల్‌తో వెంకటరామరాజు

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

ఎంఎల్‌ఎ ముదునూరి ప్రసాదరాజు

ప్రజాశక్తి - నరసాపురం

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పని చేశానని, మళ్లీ ఎంఎల్‌ఎగా గెలిపించాలని ప్రభుత్వ చీఫ్ విప్, ఎంఎల్‌ఎ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. మండలంలోని పెదమైనవానిలంక గ్రామంలో సోమవారం నిర్వహించిన ప్రజాశీర్వాద ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ప్రసాదరాజు తనయుడు కృష్ణంరాజుతో కలిసి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రసాదరాజు మాట్లాడుతూ రానున్న రోజుల్లో నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందాలంటే వైసిపి అధికారంలోకి రావాలన్నారు.




హోలీ ఆడుతున్న చిన్నారులు

భీమవరంలో హోలీ సందడి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

పట్టణంలో సోమవారం హోలీ పండుగ సందర్భంగా సందడి వాతావరణం నెలకొంది. యువత, చిన్నారులు భీమవరంలోని బలిసిమడి ప్రాంతంలో సందడి చేశారు. బివి.రాజు, ఎస్ఆర్‌కెఆర్, కెసిఆర్ఎల్ కళాశాలలో హోలీ పండుగను విద్యార్థులు ఘనంగా నిర్వహించుకున్నారు. ఒకరిపై ఒకరు రంగులు చిమ్ముకున్నారు. ఎక్కువగా నార్త్ ఇండియాలో జరిగే హోలీ పండుగ గత కొన్ని సంవత్సరాలు నుంచి తెలుగు రాష్ట్రాల్లో యువత ఉత్సాహంగా జరుపుకుంటున్నారు.



అన్నసమారాధనలో ప్రజలు

మొగల్తూరులో భారీ అన్నసమారాధన

ప్రజాశక్తి - మొగల్తూరు

పార్వతీ సమేత విశ్వేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో సోమవారం భారీ అన్న సమారాధన చేశారు. ఇటీవల మహాశివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా నిర్వహించిన అన్న సమారాధనలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. అన్న సమారాధనలో పాల్గొన్న ప్రజలకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా నిర్వహణ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

అన్న సమారాధన నిర్వహణ అభినందనీయం

ఉండి : వెల్డింగ్ వృత్తి చేసుకుంటూ జీవనం సాగించే నాగేశ్వరరావు తన సొంత నిధులు వెచ్చించి ప్రతి గురువారం అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమని ఉండి మాజీ ఎంఎల్ఎ శివరామరాజు అన్నారు. మండలంలోని ఎన్ఆర్‌పి అగ్రహారం గ్రామంలో ఉన్న గంగా సాయిబాబా మందిరం తొమ్మిదో వార్షికోత్సవ వేడుకల్లో శివరామరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం నాగేశ్వరరావు మాట్లాడుతూ తొమ్మిదేళ్లుగా ప్రతి ఏడాది వార్షికోత్సవం నిర్వహించి మండలం నలుమూలల నుంచి వచ్చే భక్తులకు అఖండ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి యడ్ల శ్రీనివాస్, బురిడి రవిబాబు, నడింపల్లి వెంకటరాజు పాల్గొన్నారు.

7న 'ఘంటసాల గాన వినోదం'

ఏలూరు: ఉగాదిని పురస్కరించుకుని ఏప్రిల్ ఏడో తేదీన ఘంటసాల స్వరపీఠం ఆధ్వర్యంలో 'ఘంటసాల గాన వినోదం' పేరుతో సంగీత స్వరాలాపన కార్యక్రమాన్ని నిర్వహించబోతున్నట్లు ఆ సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి ఎస్ఎం.సుభాని తెలిపారు. ఏలూరులోని సంస్థ కార్యాలయంలో సోమవారం జిల్లాకు చెందిన ప్రముఖ రచయిత, సంస్థ ప్రతినిధి లంకా వెంకటేశ్వర్లు, సంయుక్త కార్యదర్శి వై.అర్జునరావు, సహాయ కార్యదర్శి శ్రీవల్లి, అధ్యక్షులు ఆలపాటి నాగేశ్వరరావు, నంది అవార్డు గ్రహీత మహ్మద్ ఖాజావలీ, స్వరపీఠం సభ్యులు రాజేష్, మీనన్ ఘంటసాల గాన వినోదం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుభాని మాట్లాడుతూ 'తేట తేట తెలుగులా ఘంటసాల గాన విభావరి'గా ఘంటసాల ఆలపించిన పాటలను కళాకారులు ఆలపిస్తారన్నారు. తెలుగుభాషా పరిరక్షణ కోసం ఘంటసాల ఆలపించిన పాటలు తెలుగు విలువను ఎంతో పెంచాయన్నారు. తెలుగు పాటల మాధుర్యాన్ని భావితరానికి అందించాలనే లక్ష్యంతో ఘంటసాల గాన వినోదం ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఉగాది పురస్కారాలను ప్రదానం చేస్తామని వివరించారు.

లబ్ధి పొందితేనే వైసిపికి మద్దతు తెలపండి : పివిఎల్

ప్రజాశక్తి - ఉండి

ప్రభుత్వం నుంచి లబ్ధి పొందితేనే వైసిపికి వచ్చే ఎన్నికల్లో మద్దతు తెలపాలని డిసిసిబి ఛైర్మన్, వైసిపి ఉండి ఎంఎల్ఎ అభ్యర్థి పివిఎల్.నరసింహరాజు అన్నారు. ఉండి చిక్కాల వీరన్న నగర్ కాలనీ నుంచి ప్రచారం ప్రారంభించిన పివిఎల్.నరసింహరాజు ఒకటో సచివాలయ పరిధిలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం నుంచి లబ్ధి పొందితేనే తమకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. అంతకుముందు చిక్కాల వీరన్న నగర్ కాలనీకి చెందిన సుమారు 30 మంది యువకులు స్థానిక వైసిపి నాయకుడు పెంకి రవికుమార్ ఆధ్వర్యంలో పివిఎల్.నరసింహరాజు సమక్షంలో వైసిపిలో చేరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ఇందుకూరి శ్రీహరినారాయణరాజు, గ్రామ ఉపసర్పంచి గొట్టుముక్కల కళ్యాణ్‌వర్మ, రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ గులిపల్లి అచ్చారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఏడిద వెంకటేశ్వరరావు, నాయకులు మహంకాళి, కరిమెరక మల్లికార్జున, కమతం బెనర్జీ, బడుగు బాలాజీ, ధనుంజయ, రాయి సతీష్, అంగర రాంబాబు, శేషాద్రి శ్రీనివాస్ పాల్గొన్నారు.

'రాష్ట్రస్థాయికి శెట్టిబలిజ సంక్షేమ సంఘం'

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

జిల్లా శెట్టిబలిజ సంక్షేమ సంఘాన్ని రాష్ట్రస్థాయికి విస్తరిస్తున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షులు కుక్కల శ్రీనివాస్ చెప్పారు. మండలంలోని సగంచెరువులోని ఆయన స్వగృహంలో సోమవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ సంఘ పోరాటంతో ఉభయగోదావరి జిల్లాల్లో వైసిపి రెండు ఎంపీ, మూడు ఎంఎల్ఎ స్థానాలను ఇచ్చినందుకు జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే టిడిపి రెండు ఎంఎల్ఎ స్థానాలను ఇచ్చినందుకు చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో జనసేన కూడా శెట్టిబలిజలకు ఎంఎల్ఎ స్థానాలు కేటాయించాలని కోరారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా లస్తుల సింహాచలంను నియమించినట్లు శ్రీనివాస్ ప్రకటించారు. సంఘం జిల్లా అధికార ప్రతినిధిగా పెచ్చెట్టి ఏడుకొండలు, నరసాపురం నియోజకవర్గ కన్వీనర్‌గా గూడూరి రాజేష్, పాలకొల్లు కన్వీనర్‌గా పెచ్చెట్టి వెంకటేశ్వరరావు, యలమంచిలి మండల కన్వీనర్‌గా మళ్ల సంజయ్‌ను నియమించినట్లు చెప్పారు.

నేడు ఏలూరు జిల్లాలో భువనేశ్వరి పర్యటన

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

మండలంలో ఈనెల 26న మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు సతీమణి భువనేశ్వరి పర్యటించనున్నట్లు టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు మేఘాలదేవి తెలిపారు. మంగళవారం నుంచి నాలుగు రోజులు పాటు ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలో ఆమె పర్యటన కొనసాగనుంది. చంద్రబాబు అక్రమ అరెస్టు సమయంలో మనస్తాపానికి గురై మృతి చెందిన పార్టీ కార్యకర్తల కుటుంబాలను పరామర్శించనున్నారు. 26న రాజమండ్రి విమానాశ్రయానికి చేరుకొని నరసాపురం, ఏలూరు, మచిలీపట్నం పార్లమెంటు నియోజకవర్గాల్లో పర్యటించనున్నారు. 26న పోలవరం, కొయ్యలగూడెం, కన్నయగూడెం మండలాల్లో పర్యటించి దిర్సాం వెంకటలక్ష్మి, యార్రంపేట చంద్ర కన్నయ, బయ్యనగుడెం మర్గని వేంకటేశుల కుటుంబ సభ్యులను పరామర్శించనున్నారు. 27న పోలవరం, తాడేపల్లిగూడెం, ఉంగుటూరు, గన్నవరం నియోజకవర్గాల్లో, 28న నూజివీడు, గుడివాడ, పెనమలూరు నియోజకవర్గాల్లో, 29న మచిలీపట్నం, అవనిగడ్డ నియోజకవర్గాల్లో పర్యటిస్తారని తెలిపారు.

జనసేనలోకి చేరిక

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

జనసేన కుటుంబం జగమంతా ఉండాలని కోరుకుంటున్నానని ఆ పార్టీ తాడేపల్లిగూడెం ఎంఎల్ఎ అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. తాడేపల్లిగూడెం జనసేన పార్టీ కార్యాలయంలో సోమవారం మూడో వార్డు వైసిపి ఇన్‌ఛార్జి చిట్టూరి నాగేంద్ర తన కలనుచరులుతో జనసేన పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి బొలిశెట్టి శ్రీనివాస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదారంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ పవన్‌కళ్యాణ్ ఆశయాలను మెచ్చి వైసిపి మూడో వార్డు ఇన్‌ఛార్జి చిట్టూరి నాగేంద్ర పార్టీలోకి రావడం శుభపరిణామన్నారు.

గణపవరం : మండలంలోని మొయ్యేరులో వైసిపికి చెందిన 30 మంది జనసేన ఉంగుటూరు ఎంఎల్ఎ అభ్యర్థి పచ్చమట్ల ధర్మరాజు ఆధ్వర్యంలో సోమవారం జనసేన పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి ధర్మరాజు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జనసేన, టిడిపి నాయకులు తోట శ్రీనివాసు, కొల్లేపల్లి ప్రసాద్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఫిర్యాదు చేసినా పట్టించుకోరా..!

కారు అద్దాలు ధ్వంసం చేశారని సుధ ఆవేదన

పాలకొల్లు : ఈ నెల 22వ తేదీ శుక్రవారం రాత్రి తన ఇంటికి సమీపంలోని పార్కింగ్‌లో పెట్టిన తన కారు అద్దాలను గుర్తుతెలియని దుండగులు పగలకొట్టారని, దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదని బిజెపి కాకినాడ ఇన్‌ఛార్జి రావూరి సుధ చెప్పారు. పాలకొల్లులోని సుధ నివాసంలో సోమవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. తనను టార్గెట్ చేసి ఎవరో కావాలనే తన కారు అద్దాలు ధ్వంసం చేశారని, దీనిపై పాలకొల్లు పోలీసులకు ఫిర్యాదు చేసినా ఇప్పటివరకు పట్టించుకోలేదని చెప్పారు. దీనిపై నరసాపురం డిఎస్‌పికి ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు. తనను వ్యక్తిగతంగా లేక పార్టీపరంగా ఎవరైనా టార్గెట్ చేశారా, భవిష్యత్తులో తన కుటుంబానికి కూడా ఏదైనా హానీ చేయవచ్చని భయపడుతున్నానని చెప్పారు. గత 25 ఏళ్లుగా బిజెపిలో ఉన్నానని, ఇటువంటి సంఘటన ఎప్పుడు జరగలేదని, తాను వివాదాస్పదం లేని వ్యక్తి అని చెప్పారు.

మరుగుదొడ్డి తలుపునకు మరమ్మతులు

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - నరసాపురం

సచివాలయం వద్ద మరుగుదొడ్డి తలుపు మరమ్మతులకు గురవ్వడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రజాశక్తిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. తలుపునకు మరమ్మతులు చేసి అమర్చారు. మండలంలోని చిట్టవరం గ్రామంలో సచివాలయం వద్ద మరుగుదొడ్డి తలుపు ఇటీవల మరమ్మతులకు గురైంది. దీంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రజాశక్తిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. సోమవారం మరుగుదొడ్డి తలుపునకు మరమ్మతులు చేసి అమర్చారు.



మరమ్మతులు చేసి అమర్చిన తలుపు

బాధితులకు నిత్యావసర సరుకులు అందజేత



నిత్యావసర సరుకులు అందిస్తున్న రామ్మోహన్‌నాయుడు

ప్రజాశక్తి - నరసాపురం

వివిధ అనారోగ్యాలతో బాధపడుతున్న వ్యక్తులకు నెలకు సరిపడ నిత్యావసర సరుకులను కొవ్వలి ఫౌండేషన్ ద్వారా ప్రతినెలా ఉచితంగా అందిస్తున్నారు. దీనిలో భాగంగా సోమవారం ఫౌండేషన్ ఛైర్మన్ కొవ్వలి యతిరాజా రామ్మోహన్‌నాయుడు తన నివాసంలో నిత్యావసర సరుకులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు రెండేళ్ల క్రితం కొవ్వలి ఫౌండేషన్ ఏర్పాటు చేసి ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. విద్య, వైద్యానికి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నవారిని గుర్తించి ప్రతి నెలా వారికి మందులు అందిస్తున్నామన్నారు. పేదరికం వల్ల చదువు ఆగిపోకూడదనే ఉద్దేశంతో అనేకమంది విద్యార్థులకు సహకారం అందిస్తున్నామన్నారు. పెన్షన్ కూడా రాకుండా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నవారికి ప్రతి నెలా అవసరమైన నిత్యావసర సరుకులు ఇస్తున్నామన్నారు. నియోజకవర్గంలో కనీస అవసరాలకు కూడా ఇబ్బందులు పడే ఎంతోమందిని కొవ్వలి ఫౌండేషన్ ద్వారా ఆదుకుంటున్నామన్నారు. రాజకీయాలకు, కుల, మతాలకు అతీతంగా తమ సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నామని తెలిపారు.

ఫిజియోథెరపీపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - గణపవరం

ఫిజియోథెరపీపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ప్రముఖ ఫిజియోథెరపిస్టులు సిహెచ్.రమేష్, జి.వసంతరావు అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హైదరాబాద్ నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ వారి సహకారంతో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. బిపి, షుగర్, పక్షవాతం రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతిరోజు వ్యాయామం చేయాలన్నారు. తలనొప్పి, మెడనొప్పి, నడుం నొప్పి కలిగినప్పుడు ఏ విధంగా వ్యాయామం చేస్తే తగ్గుతుందో వైద్య సిబ్బందికి అవగాహన కల్పించారు. నొప్పి తగ్గడానికి కొబ్బరి నూనె ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి డాక్టర్ పి.సంతోష్‌నాయుడు, కమ్యూనిటీ హెల్త్ అధికారి జాలాది వెల్సన్‌బాబు, హెచ్‌వి.పద్మజ, ఆశావర్కర్లు, ఆరోగ్య కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



ఫిజియోథెరపీపై అవగాహన కల్పిస్తున్న రమేష్

వైసిపితోనే పేదలకు మేలు

మంత్రి కొట్టు సత్యనారాయణ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

వైసిపి గెలుపు రాష్ట్రానికి చారిత్రక అవసరమని, జగన్ మళ్లీ ముఖ్యమంత్రి అయితేనే పేదలకు మేలు జరుగుతుందని ఉప ముఖ్యమంత్రి, తాడేపల్లిగూడెం ఎంఎల్ఎ అభ్యర్థి కొట్టు సత్యనారాయణ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా తాడేపల్లిగూడెం రూరల్ మండలం ఆరుగొలను, జగన్నాథపురం, కృష్ణాయపాలెం గ్రామాల్లో సోమవారం ఆయన వైసిపి శ్రేణులు, గ్రామస్తులతో సోమవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ గత ఐదేళ్లుగా వైసిపి ప్రభుత్వంలో సిఎం జగన్ సంక్షేమ పథకాల ద్వారా పేదల కుటుంబాలు ఆర్థికంగా మెరుగుపడ్డాయన్నారు. పేదలకు మేలు జరుగుతుంటే తెలుగుదేశం, జనసేన పార్టీలు చూసి తట్టుకోలేక పోతున్నాయని విమర్శించారు. రాజకీయ లబ్ధి పొందాలని టిడిపి కూటమి ప్రయత్నిస్తుందన్నారు. ప్రజలు వాటిని తిప్పికొట్టాలన్నారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ సంపత్ కుమార్, ఎంపిపి శేషులత, కొమ్ముగూడెం సొసైటీ ఛైర్మన్ వెలిశెట్టి కుమార్, జగన్నాథపురం సర్పంచి ఉండ్రాజవరపు చంద్రిక పాల్గొన్నారు.

బిసి, ఎస్‌సిలకే ప్రాధాన్యత

ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

బిసి, ఎస్‌సిలకే అధిక ప్రాధాన్యతనిస్తూ తాను పని చేస్తున్నానని టిడిపి పాలకొల్లు ఎంఎల్ఎ అభ్యర్థి నిమ్మల రామానాయుడు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇంటింటి పాదయాత్రలో ఆయన మండలంలోని కాపవరం గ్రామంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్, టిడిపి, జనసేన శ్రేణులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ రామానాయుడు మాట్లాడుతూ బిసిలు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికపరంగా ఎదగాలంటే టిడిపి కూటమి అధికారంలోకి రావాలన్నారు. వైసిపి ప్రభుత్వంలో బిసిలు అన్ని రకాలుగా మోసపోయారన్నారు. మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్ మాట్లాడుతూ బిసిలంతా ఏకపక్షంగా కూటమి అధికారంలోకి రావాలని కోరుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి కోలాటి రాధా, అంగర వీరభద్రకుమార్, బంగారు రాజు, అంగర వరప్రసాద్, కోడి విజయభాస్కర్, పాములు రజనికుమార్, అందికోటి వీరభద్రం, పెచ్చెట్టి బాబు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

రానున్న ఎన్నికల దృష్టిలో ఉంచుకుని సోమవారం సాయంత్రం తాడేపల్లిగూడెం ఎస్‌వి.రంగారావు విగ్రహం వద్ద పోలీసులు తనిఖీలు నిర్వహించారు. తాడేపల్లిగూడెం టౌన్ సిఐ ఎ.సుబ్రహ్మణ్యం, టౌన్ సబ్‌ఇన్‌స్పెక్టర్ కె.సుధాకర్‌రెడ్డి, జెవిఎన్.ప్రసాద్, ట్రాఫిక్ ఎస్ఐ వి.సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేశారు. అక్రమ మద్యం, నగదు రవాణా, ఓటర్లను ప్రలోభపెట్టే వస్తువులను స్వాధీన పరుచుకునే నిమిత్తం ఈ తనిఖీ నిర్వహించినట్లు పట్టణ సిఐ సుబ్రహ్మణ్యం తెలిపారు.



వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

అందరి ఆదరణతో విజయం సాధిస్తా

జనసేన భీమవరం ఎంఎల్ఎ అభ్యర్థి అంజిబాబు

ప్రజాశక్తి - వీరవాసరం

అందరి ఆదరణతో వచ్చే అంసెబ్లీ ఎన్నికల్లో విజయం సాధిస్తానని జనసేన భీమవరం ఎంఎల్ఎ అభ్యర్థి పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. టిడిపి ఆత్మీయ సమావేశాన్ని సోమవారం తులసి కన్వెన్షన్‌లో టిడిపి మండలధ్యక్షుడు కొల్లేపర శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా అంజిబాబు మాట్లాడుతూ వైసిపిపై వ్యతిరేకత, జనసేన, టిడిపిలకు ప్రజల్లో పెరిగిన ఆదరణతో తన విజయం ఖాయమన్నారు. ఎంపిపి వీరవల్లి దుర్గాభవాని మాట్లాడారు. టిడిపి నరసాపురం పార్లమెంట్ ప్రతినిధి వీరవల్లి చంద్రశేఖర్ మాట్లాడుతూ కనుమూరి రఘురామకృష్ణంరాజుకు నరసాపురం పార్లమెంట్ స్థానానికి ఉమ్మడి అభ్యర్థిగా అవకాశం ఇవ్వకపోతే ఎంఎల్ఎ అభ్యర్థుల గెలుపోటములపై ప్రభావం చూపుతుందని, ఈ విషయంపై అధిష్టానం పరిశీలించి రఘురామకృష్ణంరాజు అభ్యర్థిత్వంపై సరైన నిర్ణయం తీసుకోవాలని కోరారు. అనంతరం పలువురు టిడిపిలోకి చేరారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన జిల్లా అధ్యక్షులు తోట సీతారామలక్ష్మి, కొటికలపూడి చినబాబు, మెంటే పార్థసారధి, జెడ్‌పిటిసి సభ్యులు గుండా జయప్రకాష్‌నాయుడు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అంజిబాబు

ఘనంగా స్వామి అమ్మవార్ల విగ్రహ పునఃప్రతిష్ట

ప్రజాశక్తి - కాళ్ల

మండలంలోని దొడ్డనపూడి గ్రామంలో పార్వతి సమేత చంద్రమౌళేశ్వరస్వామి, భూ సమేత చెన్న కేశవస్వామి, పర వారా దేవత విగ్రహ పున:ప్రతిష్ట మహోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ మంతెన రామరాజు, మాజీ ఎంఎల్ఎ వేటుకూరి శివరామరాజు, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు, గ్రామ సర్పంచి కొల్లి సుబ్బారావు, మాజీ ఎంపిపి అరేటి వెంకటరత్నం, టిడిపి మండలాధ్యక్షులు జివి.నాగేశ్వరరావు, మాజీ ఎంపిటిసిలు అరేటి గాంధీ, కందులపాటి వీరరాఘవులు, మాజీ సర్పంచి వెలివెల సుబ్బారావు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

మైనింగ్ చేస్తున్న వాహనాలు సీజ్

ప్రజాశక్తి - ఉండి

అక్రమంగా మైనింగ్ చేస్తున్న వాహనాలను రెవెన్యూ అధికారులు సీజ్ చేసిన సంఘటన ఉండి మండలంలోని కోలమూరులో చోటు చేసుకుంది. గ్రామ రెవెన్యూ అధికారి అప్పలాచార్యులు తెలిపిన వివరాల ప్రకారం.. రెండు రోజుల నుంచి గ్రామంలో అనుమతులు లేకుండా అక్రమంగా మైనింగ్‌కు పాల్పడుతున్నారని కోలమూరు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. దీంతో తహశీల్దార్ కొమ్మూరి శ్రీనివాస్ ఆదేశాల మేరకు గ్రామ రెవెన్యూ అధికారి అప్పలాచార్యులు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. సంఘటన స్థలంలో ఉన్న మూడు టిప్పర్లు, ఒక పొక్లెయినర్, ఒక డోజర్‌ను సీజ్ చేశారు. ఉన్నతాధికారులకు నివేదిక అందించినట్లు అప్పలాచార్యులు తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

ప్రజాశక్తి - మొగల్తూరు

పేకాట స్థావరంపై దాడి చేసిన పోలీసులు ముగ్గురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి నగదు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ కె.వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం... పేరుపాలెం సౌత్ పంచాయతీ పరిధి మొల్లపర్రు గ్రామంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు ఎస్ఐ వెంకటరమణ తన సిబ్బందితో సోమవారం దాడి చేశారు. ఈ దాడిలో ముగ్గురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.2050 నగదు స్వాధీనం చేసుకున్నారు.